అపోలో లాభం రూ. 372 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 10:అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.372 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది సంస్థ. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.245 కోట్ల లాభంతో పోలిస్తే 52 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.4,851 కోట్ల నుంచి రూ.5,527 కోట్లకు ఎగబాకింది. వచ్చే మూడు నుంచి నాలుగేండ్లకాలంలో కొత్తగా 11 ప్రాంతాల్లో ఆసుపత్రులను ఏర్పాటు చేయడం ద్వారా కొత్తగా 3,512 పడకలు జతకానున్నాయని అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు. ముంబై నుంచి వారణాసి, చెన్నై నుంచి గురుగ్రామ్ వరకు ఉత్తమ వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.9 లేదా 180 శాతం మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

PATANJALI®
PATANJALI FOODS LIMITED
(Formerly known as Ruchi Soya Industries Limited)

పతంజలి ఫుడ్ ఆకర్షణీయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.370.93 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది పతంజలి ఫుడ్స్ లిమిటెడ్. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.216.54 కోట్ల లాభంతో పోలిస్తే 71.29 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం కూడా రూ.7,910.70 కోట్ల నుంచి రూ.9,103.13 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. నిర్వహణ ఖర్చులు కూడా రూ.8,652.53 కోట్లకు ఎగబాకాయి

గోల్డ్ హై జంప్

ఒక్కరోజే రూ.2,430 ఎగిసిన తులం ధర

ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.88,500కు చేరిక



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: బంగారం ధరలు భారీగా పెరిగాయి. ఆల్‌టైమ్ హైలో స్థిరపడ్డాయి. సోమవారం ఒక్కరోజే దేశీయ మార్కెట్‌లో దాదాపు రెండున్నర వేలు పుంజుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు.. స్టాక్, ఫారెక్స్ మార్కెట్లతోపాటు బులియన్ మార్కెట్‌నూ షేక్ చేసేశాయి మరి. ఈ క్రమంలోనే ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల ధర రూ.2,430 ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా రూ.88,500ను తాకింది. ఈ మేరకు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలియజేసింది.

ఇదీ సంగతి..

అగ్రరాజ్యంలోకి దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియంలపై 25 శాతం సుంకాలు వేస్తామని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు కుదేలవగా.. బంగారం, వెండి తదితర కమోడిటీ మార్కెట్లు పరుగులు పెట్టాయి. ఈ నేపథ్యంలోనే స్పాట్ మార్కెట్లలో ఔన్స్ గోల్డ్ విలువ రికార్డు స్థాయిలో 2,900 డాలర్లు పలికింది. కోమెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లోనూ రూ.2,932.69 డాలర్లుగా ట్రేడైంది. త్వరలోనే 3,000 డాలర్లు పలికినా ఆశ్చర్యపోనక్కర్లేదన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇక సిల్వర్ ఔన్స్ 32.76 డాలర్లను చేరింది. ఈ ట్రెండ్ దెబ్బకు భారతీయ మార్కెట్లలోనూ హోల్‌సేల్, రిటైల్ నగల వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ కనిపించింది. ఫలితంగా ఒక్కసారిగా రేట్లు పైపైకి పోయాయి. నిజానికి గతకొద్ది రోజులుగా గోల్డ్ మార్కెట్ దూకుడు మీదనే ఉన్నది. స్టాక్ మార్కెట్ల ఒడుదొడుకుల నడుమ ఇన్వెస్టర్లు.. సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడి వైపే అడుగులు వేస్తున్నారు. అయితే ట్రంప్ దుందుడుకు నిర్ణయాలతో వాణిజ్య యుద్ధానికి అవకాశాలుండటంతో పుత్తడి ధరలు రాబోయే రోజుల్లో మరింత పెరిగే వీలే ఉన్నదంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. దీంతో మదుపరులు గోల్డ్‌పై ఇంకా ఇన్వెస్ట్‌మెంట్లు పెట్టవచ్చని అంచనా వేస్తున్నా రు. అదే జరిగితే సరికొత్త శిఖరాలను ధర లు అధిరోహించడం ఖా యమేనన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయి ప్పుడు.

హైదరాబాద్‌లో..

దేశ రాజధానిలో ధరలతో పోల్చితే హైదరాబాద్ మార్కెట్‌లో రేట్లు ఒకింత స్థిరంగానే ఉన్నట్టు కనిపిస్తున్నాయి. తులం 24 క్యారెట్ గోల్డ్ రేటు రూ.87,060గా ఉన్నది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) పసిడి ధర రూ.79,800గా నమోదైంది. గతంతో పోల్చితే వరుసగా రూ.390, రూ.350 చొప్పున పెరిగాయి. ఇక ఢిల్లీలో కిలో వెండి ధర రూ.97,500గా ఉన్నది. మునుపటితో చూస్తే రూ.1,000 పెరిగింది. ఇక ఎంసీఎక్స్‌పై ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో గోల్డ్ కాంట్రాక్ట్స్ ఏప్రిల్‌కుగాను 10 గ్రాములు రూ.940 పెరిగి రూ. 85,828గా నమోదైంది. జూన్‌కు రూ.1,015 ఎగిసి రూ.86,636గా ఉన్నది.

త్వరలో తులం లక్ష?

బంగారం ధరలు పెరుగుతున్న తీరును చూస్తే తులం లక్ష రూపాయలను తాకే సమయం ఎంతో దూరంలో లేదనిపిస్తున్నది. రేపటి రోజుల్లో పసిడి ధరలు మరింత పెరుగుతాయంటున్న మార్కెట్ నిపుణులు.. ఈ ఏడాది చివర్లో దేశీయ విపణిలోనే 10 గ్రాములు లక్ష రూపాయల మార్కును తాకినా ఆశ్చర్యపోనవసరం లేదని చెప్తున్నారు మరి. అయితే గ్లోబల్ మార్కెట్‌లోనూ ఔన్స్ 2,900 డాలర్ల మార్కును దాటడం ఈ అంచనాలకు బలం చేకూరుస్తున్నది. మొత్తానికి ఈ ఏడాది ధరల స్థిరీకరణకు అవకాశాలు తక్కువేనన్న మాట మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ నుంచి వినిపిస్తున్నది.

రిలయన్స్ స్పోర్ట్ స్డ్రింక్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:రిలయన్స్ గ్రూపునకు చెందిన రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ తాజాగా స్పోర్ట్స్ హైడ్రేషన్ డ్రింక్ సెగ్మెంట్‌లోకి ప్రవేశించింది. ప్రముఖ శ్రీలంక క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్‌తో కలిసి స్పిన్నర్ పేరుతో ఈ డ్రింక్‌లను మార్కెట్లోకి విడుదల ఏసింది. ఇప్పటికే కంపా కొలా పేరుతో కూల్‌డ్రింక్స్‌ను విక్రయిస్తున్న సంస్థ తాజాగా విడుదల చేసిన 150 ఎంఎల్ సింగిల్-సర్వ్ బాటిల్ కలిగిన స్పోర్ట్స్ డ్రింక్ ధర రూ.10గా నిర్ణయించింది. ఇతర పోటీ సంస్థలైన పెప్సీకో, కోక-కోలాకు చెందిన స్పోర్ట్స్ డ్రింక్స్ కంటే తక్కువ ధరతో విడుదల చేయడం విశేషం.

టాటా బోయింగ్ 300వ ఫ్యూజ్‌లేజ్

హైదరాబాద్, ఫిబ్రవరి 10: టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ హైదరాబాద్ యూనిట్ నుంచి ఏహెచ్-64 అపాచీ అటాక్ హెలిక్యాప్టర్ కోసం మరో బాడీని డెలివరీ చేసింది. ఈ ఫ్యూజ్‌లెజ్ 300వది కావడం విశేషం. ఇక ఈ హెలిక్యాప్టర్లను అమెరికా ఆర్మీతోపాటు భారత ఆర్మీ కూడా వినియోగిస్తున్నది. దేశీయ ఎయిర్‌పోర్స్ 22 ఏహెచ్-64ఈ అపాచీ హెలిక్యాప్టర్లను కలిగివున్నది. బోయింగ్, టీఏఎస్ఎల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో 900 మంది ఇంజినీర్లు, టెక్నిషన్లు ఉన్నారు. 14 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో తయారైన ఉత్పత్తులు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతున్నాయి.

ట్రంప్ టారీఫ్‌ల దెబ్బ

సెన్సెక్స్ 548, నిఫ్టీ 178 పాయింట్ల పతనం

ముంబై, ఫిబ్రవరి 10: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగోరోజూ భారీగా నష్టపోయాయి. అమెరికా దిగుమతి చేసుకునే అల్యూమినియం, స్టీల్‌పై 25 శాతం సుంకం విధిస్తామని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు మార్కెట్లపై పిడుగుపడ్డట్టు అయింది. మదుపరుల్లో నమ్మకం సడలడంతో అమ్మకాల బటన్ నొక్కారు. బ్లూచిప్ సంస్థల షేర్లతోపాటు బ్యాంకింగ్, మెటల్, చమురు రంగ షేర్లు కుదేలవడం సూచీల పతనానికి ఆజ్యంపోసింది. ఇంట్రాడేలో 750 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 548 పాయింట్లు నష్టపోయి 77,311.80 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 178.35 పాయింట్లు కోల్పోయి 23,381.60 వద్ద స్థిరపడింది. అమెరికా టారిఫ్ భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని, దేశీయ మదుపరులు తమ పెట్టుబడులను ఈక్విటీల నుంచి సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం కూడా పతనానికి పరోక్షంగా కారణమయ్యాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

టాప్ లూజర్‌గా పవర్‌గ్రిడ్

నిరుత్సాహక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో పవర్‌గ్రిడ్ షేరు భారీగా పతనం చెందింది. ఒక దశలో నాలుగు శాతానికి పైగా నష్టపోయిన షేరు చివరకు 3.45 శాతం నష్టంతో రూ.268.70 వద్ద ముగిసింది. దీంతోపాటు టాటా స్టీల్, జొమాటో, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ షేర్లు కూడా రెండు శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి. అలాగే మహీంద్రా, టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, రిలయన్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి. వీటితోపాటు సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, అదానీ పోర్ట్స్, ఎల్‌అండ్‌టీ, నెస్లె, ఎస్బీఐ షేర్లు పతనం చెందాయి. కానీ, కొటక్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, హెచ్‌యూఎల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 2.25 శాతం తగ్గగా, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.06 శాతం క్షీణించాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ రంగ సూచీ అత్యధికంగా 2.69 శాతం నష్టపోగా, మెటల్ 2.63 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ 2.61 శాతం, యుటిలిటీ 2.49 శాతం దిగువకు పడిపోయాయి.

నష్టాలకు కారణాలు ఇవే

- అమెరికా దిగుమతి చేసుకునే స్టీల్, అల్యూమినియంపై 25 శాతం సుంకాల ప్రకటన
- దేశీయ మార్కెట్లో విదేశీ మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడం
- రూపాయితో పోలిస్తే డాలర్ మరింత బలపడటం
- దేశీయ కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు

నాలుగు రోజుల్లో 7.68 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతుండటంతో లక్షల కోట్ల రూపాయల మదుపరుల సంపద కరిగిపోతున్నది. ఎఫ్ ఐఐలు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం, కొత్తగా టారిఫ్ యుద్ధానికి ట్రంప్ తెరలేపడంతో గత నాలుగు సెషన్లలో మదుపరులు రూ.7.68 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో నమోదిత సంస్థల విలువ రూ.7,68,252.32 కోట్లు కరిగిపోయి రూ.4,17,82,573.79 కోట్లకు చేరింది.

88 దగ్గరదాకా..

ఆఖర్లో కోలుకున్న రూపాయి • 5 పైసలు పెరిగి 87.45 వద్ద ముగింపు

ముంబై, ఫిబ్రవరి 10: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ సోమవారం తీవ్ర ఆటుపోట్లకు లోనైంది. ఒకానొక దశలో 50 పైసలు క్షీణించి 88 దరిదాపుల్లోకి దిగజారింది. ఆల్‌టైమ్ ఇంట్రా-డే కనిష్ఠాన్ని తాకుతూ 87.95 స్థాయిని చేరింది. అయితే ఆఖర్లో కోలుకున్నది. ఈ క్రమంలోనే చివరకు 5 పైసలు లాభపడి 87.45 వద్ద ముగిసింది. శుక్రవారం 87.50 దగ్గర ఆగిన విషయం తెలిసిందే. కానీ అంతకుముందు రోజు గురువారం మునుపెన్నడూ లేనివిధంగా 87.59 స్థాయికి పడిపోయి ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలో తాజా లాభాలతో వరుసగా రెండు రోజుల ట్రేడింగ్‌లో 14 పైసలు లాభపడినట్టైంది. కాగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తమ దేశంలోకి దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియంలపై 25 శాతం సుంకాలు వేయడం డాలర్‌ను బలపర్చింది. అమెరికాపై పరస్పర సుంకాలతో బదులిస్తున్న దేశాలపై ప్రతీకార సుంకాలకూ ట్రంప్ దిగుతున్నారు. ఇది అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి దారితీస్తుందేమోనన్న భయాలు ఇప్పుడు వెంటాడుతున్నాయి. ఈ అంచనాలు కూడా రూపీని బలహీనపరుస్తున్నాయన్న అభిప్రాయాలు ఫారెక్స్ మార్కెట్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

రిక్తమ్ ఏఐ ఆధారిత ఇంటర్వ్యూ సేవలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10: హైదరాబాద్ ఆధారిత రిక్తమ్ గ్రూపు తాజాగా కృత్రిమ మేధస్సు(ఏఐ) ఆధారంగా ఇంటర్వ్యూ సేవలు అందించే టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. మానవ వనరుల విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంలో సరికొత్త టెక్నాలజీని పరిచయం చేసినట్లు ఇంటర్వ్యూ ఏఐ కో-ఫౌండర్, సీఈవో సిద్ధరామ్ శింగిషెట్టి తెలిపారు. ఈ సేవలతో ఇంటర్వ్యూ మరింత సులభతరం కానున్నదని, అలాగే సమయం ఆదా కానున్నదని ఆయన చెప్పారు.

మేడారానికి బస్సులు నడపాలి

మహాముత్తారం, ఫిబ్రవరి 10 : కాటారం నుంచి మేడారం మినీ జాతరకు ఆర్టీసీ బస్సులను నడపాలని బీఆర్ఎస్ మండల నాయకులు మాజీ జడ్పీటీసీ మండల రాజిరెడ్డి, మార్క రాముగౌడ్, జయపాల్ నాయక్, బోడ బాలాజీ నాయక్ ఒక ప్రకటనలో కోరారు. జాతరకు కాటారం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న ఆదివాసి, గిరిజన గ్రామాల నుంచి అత్యధికంగా తరలి వెళ్తారని, దీనిని దృష్టిలో పెట్టుకొని బస్సులు నడపాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 10 : జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. జవహర్ నగర్ కాలనీకి చెందిన కార్మికుడు అంకం రాజేశం ఎస్‌బీఐ బ్యాంకు ముందు స్కూటీపై రోడ్డు క్రాస్ చేస్తుండగా భూపాలపల్లి నుంచి పరకాల వైపు వెళ్తున్న ఇన్నోవా వాహనం వెనుక నుంచి అతివేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజేశానికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

అడవికి నిప్పుపై ప్రజలకు అవగాహన

వాజేడు, ఫిబ్రవరి 10 : మండలంలోని కోయవీరాపురం, కృష్ణాపురం, పూసూరు అటవీశాఖ బీట్ పరిధిలోని ఎడ్జర్లపల్లి బీట్ గ్రామాల్లో సోమవారం ఎఫ్ఆర్వో చంద్రమౌళి, పూసూరు సెక్షన్ ఆఫీసర్ నాగమణి ఆధ్వర్యంలో అడవికి నిప్పు పెట్టడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. వన్యప్రాణుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ నారాయణ, బీట్ ఆఫీసర్స్ భిక్షపతి, రామ్మూర్తి, పున్నమయ్య, గంగాభవానీ, పద్మ, ప్రసాద్ రావు, మనీషా, బేష్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు

భూపాలపల్లి రూరల్ , ఫిబ్రవరి 10 : భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 11,12 తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం భూపాలపల్లి జిల్లా అధికారి చింతల అన్వేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, గ్రూప్ రన్నింగ్, షటిల్ సింగిల్స్, కబడ్డీ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పేర్ల నమోదుకు జిల్లా యూత్ క్లబ్ అధ్యక్షుడు చల్ల దీపక్ 7569768191 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

పీవోకు జాతర ఆహ్వాన పత్రిక అందజేత

ఏటూరునాగారం, ఫిబ్రవరి 10 : మండలంలోని కొండాయిలో రేపటి నుంచి జరుగనున్న గోవిందరాజులు, నాగులమ్మ, సారలమ్మ జాతరకు రావాలని కోరుతూ సోమవారం పూజారులు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాకు ఆహ్వాన పత్రిక అందజేశారు. జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసేందుకు చొరవ చూపినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పీవోను కలిసిన వారిలో పూజారులు దబ్బగట్ల గోవర్ధన్, రఘు, రూపేష్ ఉన్నారు.

భౌతికశాస్త్రంపై అవగాహన పెంచుకోవాలి

భూపాలపల్లి డీఈవో రాజేందర్

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 10: భౌతికశాస్త్రంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని డీఈవో రాజేందర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాత డీఈవో ఆఫీస్‌లో జిల్లా సైన్స్ అధికారి స్వామి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో రాజేందర్ హాజర య్యారు. జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోంటో, ప్రశాంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ నిత్య జీవితంలో మనకు భౌతికశాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవో లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు కాలరాసిన ఐఎన్‌టీయూసీ

టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య

మాట్లాడుతున్న భూపాలపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 10 : సింగరేణి కార్మికుల హక్కులను కాల రాసింది, శ్రమ దోపిడీకి గురి చేసింది ఐఎన్‌టీయూసీ అని టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డిపై వ్యక్తిగత, సత్యదూరమైన ఆరోపణలు చేసిన ఐఎన్‌టీయూసీ నాయకుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఐఎన్‌టీయూసీ కార్మికుల హక్కులను కాలరాస్తే, 20 వేల మందికి టీబీజీకేఎస్ వారసత్వ ఉద్యోగాలు ఇప్పించిందన్నారు. కోల్ ఇండియాలో లేనటువంటి ఎన్నో హక్కులను టీబీజీకేఎస్ సాధించిందని, గౌరవ అధ్యక్షురాలు కవిత సహకారంతో ఎన్నో హక్కులను సాధించి కార్మికుల మన్ననలు పొందుతున్నామన్నారు. అమలు కాని హామీలు కార్మికులకు ఇచ్చి గడిచిన 14 నెలల్లో ఏ ఒక్క హక్కు సాధించకుండా కాలయాపన చేస్తున్న మీ ఐఎన్‌టీయూసీ నాయకుడు జనక్ ప్రసాద్ అని గుర్తు చేస్తున్నామని అన్నారు. ముందు కార్మికులకు ఇచ్చిన 240 గజాల ఇంటి స్థలం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణం, ఇన్‌కం ట్యాక్స్ రద్దు, నూతన గనుల ఏర్పాటు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం వంటి హామీలను వెంటనే నెరవేర్చాలని, లేకుంటే కార్మికులే తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు. సమావేశంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఆర్గనైసింగ్ సెక్రటరీ మధు, బ్రాంచి నాయకులు నరేందర్, రమేశ్, ఫిట్ సెక్రెటరీలు సురేశ్, వంశీ, అధికార ప్రతినిధి గోవర్ధన్, ఫిట్ నాయకులు ప్రవీణ్, మహేందర్ పాల్గొన్నారు.

జాతరకు తరలివచ్చిన భక్తులతో గొంతెమ్మ గుట్ట

వైభవంగా లక్ష్మీదేవర జాతర

కాటారం, ఫిబ్రవరి 10 : మండలంలోని ప్రతాపగిరి సమీపం దండకారణ్యంలోని లక్ష్మీదేవర మహా జాతర వైభవంగా జరుగుతున్నది. సోమవారం జాతరకు పలు ప్రాంతాల నుంచి వచ్చిన నాయకపోడ్ కులస్తులు, పెద్దపల్లి, ములుగు, మంచిర్యాల జిల్లాల పరిధిలోని 15కు పైగా లక్ష్మీదేవరలతో డప్పు చప్పుళ్లు, శివ సత్తుల పూనకాల మధ్య గొంతెమ్మ, లక్ష్మీదేవర పెద్దపట్నాలు వేసి బోనాలు సమర్పించారు. అనంతరం లక్ష్మీదేవరలు, శివసత్తుల విన్యాసాలతో పట్నాలు తొక్కించే వేడుక ఆకట్టుకుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ నేతలు జాతరలో పాల్గొని ఉత్సవ మూర్తులకు మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు తదితర వాహనాల ద్వారా అటవీ మార్గం గుండా జాతరకు చేరుకున్నారు. మార్గమధ్యంలో రోడ్డు సరిగ్గా లేక భక్తు లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గుట్టపై సారంగంలోని కొల్లుగుంట, గొంతెమ్మ, కృష్ణుడి పాదాలు, శివలింగానికి భక్తులు మొక్కుకున్నారు. సీఐ నాగార్జునరావు, ఎస్సైలు అభినవ్, శ్రీనివాస్ పోలీస్ బలగాలతో పటిష్ట భద్రత కల్పించారు. జాతర నిర్వహణ కమిటీ సభ్యులు మేకల సంతోష్, గుంటి రాజేందర్, మేకల పోచం, కిష్టయ్య, మధునయ్య, పోలం రాజేందర్, మేకల పోచయ్య, ఎర్రయ్య, రవీందర్, ఎర్రయ్య, గుంటి రాజు, ధర్మేంద్ర, దేవయ్య, ప్రతాప్, లస్మయ్య, కిష్టయ్య, బుచ్చయ్య, లక్ష్మయ్య, మధునక్క, పోసక్క, రమాదేవి, అనూష, లచ్చక్క పాల్గొన్నారు.

కామేశ్వరాలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

రిటైనింగ్ వాల్ పనులు ప్రారంభం

వెంకటాపూర్, ఫిబ్రవరి 10 : రామప్ప దేవాలయ ప్రాంగణంలోని కామేశ్వరాలయ పునర్నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. కేంద్రం రూ.11 కోట్లు కేటాయించగా కేంద్ర పురావస్తు శాఖ అధికారులు గత డిసెంబర్‌లో ప్లేట్ లోడ్ టెస్ట్ చేసి ఆలయ నిర్మాణంలో శిలల బరువు ఎంత మేరకు తట్టుకుని నిలబడుతుందో పరీక్షలు నిర్వహించారు. గత వారం నుంచి ఆలయం చుట్టూ కందకం తవ్వి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి పనులు మొదలు పెట్టారు. దేవాలయ పునాదిలో ఇసుకతో నిర్మాణం చేయడం కాకతీయ కట్టడాల ప్రత్యేకత, కాగా, ఇసుకను కాలక్రమేణా చీమలు బయటకు తోడడంతో ఆలయ పునాదిలో కదలికలు ఏర్పడి ఆలయం కుంగిపోయే అవకాశం ఉంది. ఇసుకను చీమలు బయటకు తోడకుండా ఆలయ పునాది చుట్టూ పది అడుగుల మేర కందకం తవ్వి రాళ్లతో గోడ నిర్మాణ పనులను ప్రారంభించారు. దీనివల్ల భవిష్యత్‌లో ఆలయ పునాదిలోకి ఎలుకలు చొరబడకుండా, చీమలు ఇసుకను బయటకు తోడకుండా ఉంటుందని అధికారులు తెలిపారు.

కామేశ్వరాలయ పునర్నిర్మానికి జరుగుతున్న పనులు

ఓటరు జాబితా ప్రదర్శన

మంగపేట, ఫిబ్రవరి 10 : మండల పరిషత్ కార్యాలయంలో 2025 స్థానిక సంస్థల ప్రాదేశిక ఎన్నికల డ్రాఫ్ట్ పోలింగ్, ఓటరు జాబితాను సోమవారం ఎంపీడీవో భద్రు విడుదల చేశారు. ఈ సందర్భంగా 14 ఎంపీటీసీ స్థానాలకు చెందిన ఓటరు జాబితాలను ప్రదర్శించారు. రాజకీయ పార్టీల నాయకులు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆలేటి సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా మారిన మహదేవపూర్ మా ఊరి సంత

ప్రారంభానికి నోచుకోని 'మా ఊరి సంత'

మహదేవపూర్, ఫిబ్రవరి 10 : మండల కేంద్రంలోని గడి ఆవరణలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన 'మహదేవపూర్ మా ఊరు సంత' ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారింది. వ్యాపారులకు సౌకర్యవంతంగా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సకల హంగులతో చేపట్టిన సంత సముదాయాన్ని పట్టించుకునే వారు లేక శిథిలావస్థకు చేరుకుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి, మా సంతను ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడం లేదని కాంగ్రెస్ నేత ఆత్మహత్యా యత్నం

సత్యనారాయణ

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): కాటారం మండలం విలాసాగర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అందె సత్యనారాయణ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ